సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 11 । మార్చి । 2024



వంశధారకు నందీశ్వరుడు

శ్రీముఖలింగంలో నేడు చక్రతీర్థ స్నానాలు జరగనున్నాయి. ఏర్పాట్లు పూర్తి చేశారు.

- 8లో



ఆదిత్యుని సన్నిధిలో..

ఆదిత్యుని సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్ద ఎత్తున జనం హాజరయ్యారు.

- 8లో

నేడు స్పందన రద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: జిల్లా పరిషత్‌ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి తెలిపారు. ఎన్నికల శిక్షణ తరగతులు జరుగనున్న కారణంగా రద్దు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

న్యూస్‌రీల్‌

పోలీసుల ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ నాగేశ్వరరెడ్డి

మందస, కాశీబుగ్గ: మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా రెండు రోజుల పాటు వాలీబాల్‌, క్రికెట్‌ పోటీలు జరుగుతాయి. పోటీలను కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి ప్రారంభించారు. కాశీబుగ్గ పోలీసు క్రీడా మైదానంలో ఎస్పీ కప్‌ పోటీలు ప్రారంభమయ్యాయి. ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు కాశీబుగ్గ పోలీసు డివిజన్‌ అధికారి నాగేశ్వరరెడ్డి క్రీడాపోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

పూర్తయిన ప్రవేశ పరీక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ గురుకుల విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష సజావుగా జరిగింది. ఈ పరీక్షలు జిల్లాలో 9 కేంద్రాల్లో నిర్వహించారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 11,674 మంది దరఖాస్తు చేసుకోగా 11,418మంది హాజరయ్యారు. 256 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌ ప్రవేశ పరీక్షకు 1479 మంది దరఖాస్తు చేసుకోగా 1329 మంది హాజరయ్యారు. 150 మంది గైర్హాజరయ్యారు. పలు కేంద్రాలను జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ సమన్వయాధికారి ఎన్‌.బాలాజీ పరిశీలించారు.

మార్కెట్‌లో బ్రకోలీ సందడి



కాశీబుగ్గ మార్కెట్‌లో బ్రకోలి అమ్మకాలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ, పరిసర ప్రాంతాల్లో బ్రకోలి పంట సందడి చేస్తోంది. దేశీ బ్రకోలీని స్థానిక రైతులు పండించి వాటిని పట్టణానికి తరలిస్తున్నారు. ఇప్పుడిప్పుడే నెమ్మదిగా ఈ పంట విస్తరిస్తోంది. కిలో రూ.50పైగా పలుకుతోంది.

నేటి పోలీసు స్పందన రద్దు

శ్రీకాకుళం క్రైం: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన రద్దుచేసినట్లు ఎస్పీ జీఆర్‌ రాధిక తెలిపారు. శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానాలకు బందోబస్తు నిర్వహిస్తున్నందున స్పందన రద్దు చేసినట్లు తెలిపారు.

జిల్లా క్రికెట్‌కు మహర్దశ

శ్రీకాకుళం రూరల్‌: జిల్లా క్రికెట్‌కు మహర్దశ పట్టబోతోందని జిల్లా క్రికెట్‌ సంఘం మెంటార్‌ ఇలియాస్‌ మహ్మద్‌ అన్నారు. క్రికెట్‌ కోసం ప్రత్యేక స్టేడియాన్ని నిర్మించేందుకు స్థలం ఫైనల్‌ చేయడంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు కృషి అభినందనీయమని పేర్కొన్నారు. మంత్రి ధర్మాన ఆహ్వానం మేరకు జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న కుశాలపురం గ్రౌండ్‌కు ఆంధ్ర క్రికెట్‌ అసోసియేషన్‌ సెక్రటరీ గోపినాథ్‌ రెడ్డి ఆదివారం వచ్చి పరిశీలించారు. శాప్‌ నుంచి సేకరించాల్సిన స్థలాన్ని మెంటార్‌ ఇలియాస్‌ మహ్మద్‌, ట్రెజరర్‌ కె.ఎస్‌.ఎం.సైలని, కౌన్సిలర్‌ సువారి రవికుమార్‌లు చూపించి తమ ప్రతిపాదనలు గోపీనాథ్‌రెడ్డికి వివరించగా వెంటనే అంగీకారం తెలిపారు. స్థలం ప్రతిపాదనను అంగీకరించిన గోపినాథ్‌రెడ్డిని దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో క్రికెటర్‌ అడ్మినిస్ట్రేటర్‌ ఎంఎస్‌ కుమార్‌ పాల్గొన్నారు.

సేవల కోవెల

ఐదువేల పైచిలుకు మందికి ప్రభుత్వ ఉద్యోగాలు, పౌర సేవల్లో పాతుకుపోయిన జాప్యాలకు చరమ గీతాలు, ఊరూరా శాశ్వత ప్రభుత్వ భవనాలు, అర్హులందరికీ పథకాలు.. వెరసి గ్రామ సచివాలయాలు. గ్రామ స్వరాజ్యం అన్న స్వప్నాన్ని సాకారం చేసి చూపించిన వ్యవస్థ ఇది. పల్లెకు ప్రభుత్వాన్ని దగ్గర చేసిన ఆత్మ బంధువు ఇది. రేషన్‌ నుంచి పెన్షన్‌ వరకు, ఇంటి పట్టా నుంచి ధ్రువీకరణ పత్రాల వరకు, లైసెన్సుల నుంచి రిజిస్ట్రేషన్ల వరకు సకల సేవలకు శాశ్వత చిరునామాగా సచివాలయం నిలుస్తోంది. పాలనలో వైఎస్సార్‌ సీపీ చూపిన చొరవకు సజీవ సాక్ష్యంగా విరాజిల్లుతోంది.



15 నిమిషాల్లో ఒంటరి మహిళ రేషన్‌ కార్డును పొందిన జయమ్మ

- పారదర్శక పాలనకు వేదికగా సచివాలయ వ్యవస్థ
- జిల్లాలో 732 సచివాలయాల్లో అద్భుత సేవలు
- ఇప్పటివరకు మొత్తం 53.22 లక్షల మందికి వివిధ రకాల సేవలు
- రాష్ట్రంలో సచివాలయ సేవల్లో జిల్లాకు మూడో స్థానం

అరసవల్లి: వందలాది సేవలు గ్రామీణులకు అతి తక్కువ సమయానికే అందుతున్నాయి. ఎక్కడా చేతులు తడపకుండా, ఎవ్వరి అండ లేకపోయినా చకచకా ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. కరోనా లాంటి మహమ్మారి నుంచి ప్రజలను రక్షించేందుకు వారియర్స్‌ రూమ్‌గా సచివాలయాలు పనిచేశాయి. దేశంలోనే సచివాలయ సేవల ద్వారా ప్రజల్లో సంతృప్తి శాతం పెంచడంలో గుర్తింపు పొందిన ఏకైక రాష్ట్రంగా మన రాష్ట్రం నిలిచింది. మహాత్ముడి ఆశయాల సాధనకై 2019 అక్టోబర్‌ 2న 'సచివాలయాలు' అనే సరికొత్త వ్యవస్థకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో ప్రజలు చిన్నచిన్న ప్రభుత్వ సేవలకు కూడా మండల కేంద్రాలకు, జిల్లా కేంద్రాలకు పరుగులు పెడుతున్న నాటి రోజులకు ఫుల్‌స్టాప్‌ పెట్టి.. అత్యంత చేరువగా సచివాలయాల్లోనే అన్ని పనులను టైంబాండ్‌తో పరిష్కరించుకునేలా వ్యవస్థకు రూపకల్పన చేశారు.

రికార్డు స్థాయిలో సేవలు

జిల్లాలో 647 గ్రామ సచివాలయాలు, 85 వార్డు సచివాలయాలు పనిచేస్తుండగా, ఇందులో మొత్తం 5301 మంది రెగ్యులర్‌ ఉద్యోగులు సేవలను అందిస్తున్నారు. ఇక సచివాలయాల్లో మొత్తం 548 రకాల ప్రభుత్వ సేవలను వివిధ రకాలుగా ప్రజలకు నిర్ణీత గడువులోగా అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆస్తుల రిజిస్ట్రేషన్‌ ప్రక్రియను కూడా సచివాలయాలకే అనుసంధానం చేసింది. దీంతో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌ కూడా శరవేగంగా జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాల సేవల విషయంలో మన జిల్లా మూడో స్థానంలో నిలిచిందనే లెక్కలున్నాయి. వ్యవస్థ ప్రారంభం నుంచి నేటి వరకు జిల్లాలో వివిధ రకాల సేవలను మొత్తం 53,22,317 మందికి సచివాలయాల ద్వారా అందించినట్లుగా రికార్డులు చెబుతున్నాయి.



మరింత విశ్వాసం పెంచేలా..



జిల్లాలో గ్రామ/వార్డు సచివాలయాల్లో సేవలపై మరింత విశ్వాసం పెంచేలా చర్యలు చేపడుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న క్రమంలో సేవలందించే విషయంలో ఎక్కడ నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదు. మరిన్ని కొత్త సేవలు అందుబాటులో రానున్నాయి.

– పి.వాసుదేవరావు, సచివాలయాల నోడల్‌ ఆఫీసర్‌

15 నిమిషాల్లోనే రేషన్‌ కార్డు

నేను ఒంటరి మహిళను. నాకు రేషన్‌ కార్డు లేదు. అయితే జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒంటరి మహిళలకు కూడా రేషన్‌ కార్డులు ఇస్తామని అన్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న 15 నిమిషాల్లోనే నాకు కార్డు ఇచ్చేశారు. నాలాంటి పేదల కష్టం తీర్చే జగనన్న ప్రభుత్వమే మళ్లీ రావాలి.

– దుప్పట్ల జయమ్మ, పెద్దసాన, టెక్కలి మండలం.

రెగ్యులర్‌ ఉద్యోగులమయ్యాం



సచివాలయాల ఉద్యోగాలంటే అప్పట్లో కొందరు చులకనగా మాట్లాడారు. అయితే ప్రభుత్వం మాలాంటి ఉద్యోగులందరికీ నిబంధనల ప్రకారం ప్రొబేషన్‌ డిక్లేర్‌ చేసి రెగ్యులర్‌ చేసింది. ఒక్క పైసా కూడా లంచం ఇవ్వకుండా నాలాంటి వేలాది మందికి సచివాలయాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో చాలా మంది నిరుద్యోగులు ఉద్యోగులయ్యారు.

– ఎం. సురేష్‌, సర్వేయర్‌, సతివాడ, గార మండలం

లక్షలాది మందికి సేవలు..

2020లో 7,45,709 మందికి, 2021లో 10,94,521 మందికి, 2022లో 10,12,647 మందికి, 2023లో 19,14,900 మందికి.. అలాగే 2024లో ఇంతవరకు 1,56,287 మందికి వివిధ రకాల వినియోగ సేవలను అందించింది. అలాగే జిల్లాలో ఆధార్‌ కార్డు సెంటర్లుగా 146 చోట్ల ఏర్పాటు చేయగా, మొత్తం 3,98,253 మందికి ఆధార్‌ కార్డులను కొత్తవి, మార్పులు చేర్పులు చేస్తూ అందజేశారు. అన్ని వర్గాల వారికి ఇక్కడ సేవలు సులువుగా అందుతున్నాయి.



మళ్లీ గెలిచేది వైఎస్‌ జగనే



- ఒంటరిగా పోటీ చేయలేకే టీడీపీ పొత్తులు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌

నరసన్నపేట: ఎంత మంది కలిసి వచ్చినా మళ్లీ గెలిచేది వైఎస్‌ జగనేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ పొత్తులు అందరూ గమనిస్తూనే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వారికి ఓటమి తప్పదని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒంటరిగా పోటీ చేసే సత్తా లేకే ఈ విధంగా పొత్తులు పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఏపీ, తెలంగాణాల్లో అన్ని పార్టీలతో చంద్రబాబు పొత్తులు పెట్టుకున్నారని విమర్శించారు. 2018లో బీజేపీని దారుణంగా దూషించిన చంద్రబాబు నేడు దేహీ అంటూ ఢిల్లీలో పడిగాపులు పడి పొత్తులు కుదుర్చుకున్నారని దుమ్మెత్తిపోశారు. ఈ పొత్తులు అనైతికమని పేర్కొన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌కు జనం అండగా ఉంటారని చెప్పారు.


కిరణ కరుణ లేదు

- రెండో రోజూ కనిపించని కిరణ స్పర్శ
- మళ్లీ అక్టోబర్‌లోనే కిరణ దర్శనం



కిరణ స్పర్శ దర్శనానికి వచ్చిన భక్తులు

అరసవల్లి: ఆదిత్య క్షేత్రంలో రెండో రోజు కూడా కిరణ స్పర్శ దర్శనం కలగలేదు. కిరణ దర్శనానికై వచ్చిన వందలాది మంది భక్తుల నిరీక్షణ ఫలించలేదు. ఆదివారం ఉదయం సూర్యోదయ సమయాన మబ్బులు కమ్మేయడంతో కిరణాలు గర్భాలయానికి చేరుకోలేదు. మబ్బులు కారణంగా ఈ ఆయనంలో రెండు రోజులూ కిరణ దర్శనం జరుగలేదని, మళ్లీ రానున్న అక్టోబర్‌ 1, 2 తేదీల్లో కిరణ స్పర్శ కనిపించే అవకాశం ఉందని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు.



సూర్యోదయ సమయంలో..

ప్రజలు, ప్రభుత్వానికి ఉద్యోగులే వారధులు



ధర్మానను సత్కరిస్తున్న ఎన్‌జీఓ సంఘ ప్రతినిధులు

- ఆత్మీయ అభినందన సభలో రెవెన్యూ మంత్రి ధర్మాన

శ్రీకాకుళం అర్బన్‌: ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉద్యోగులు చాలా కీలకపాత్ర పోషిస్తారని రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఏపీ ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పడిన తర్వాత నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన కేవీ శివారెడ్డి, చౌదరి పురుషోత్తమనాయుడులు మొదటిసారిగా జిల్లాకు వచ్చిన సందర్భంగా ఏపీ ఎన్‌జీఓ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం అధ్యక్షతన ఆదివారం శ్రీకాకుళంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ధర్మాన హాజరై మాట్లాడారు. ఉద్యోగులు లేకుండా ప్రభుత్వాలు నడవలేవని అన్నారు. గత 20 ఏళ్ల కాలంలో జిల్లాలో ఎన్‌జీఓ సంఘానికి చౌదరి పురుషోత్తమ నాయుడు చేసిన సేవ ఎనలేనిదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం గొప్ప విషయమన్నారు. ఈ ఐదేళ్లలో సీఎం వైఎస్‌ జగన్‌ తీసుకువచ్చిన సంస్కరణలను చాలా రాష్ట్రాలు అనుసరించడానికి చూస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం ఎన్‌జీఓ సంఘ ప్రతినిధులంతా ధర్మానను ఘనంగా సన్మానించారు. అలాగే ఎన్‌జీఓ సంఘంతో పాటు పలు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు శివారెడ్డి, చౌదరి పురుషోత్తమ నాయుడులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముందు భారీ ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు(ఉద్యోగుల సంక్షేమం) ఎన్‌.చంద్రశేఖర్‌రెడ్డి ఏపీ ఎన్‌జీఓ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం ఆరోగ్యానికి వరం



బెల్లుపడ వద్ద ప్రారంభానికి సిద్ధమైన యూపీహెచ్‌సీ



పురుషోత్తపురం వద్ద ప్రారంభానికి సిద్ధమైన యూపీహెచ్‌సీ

- రెండు అర్బన్‌ హెల్త్‌ సెంటర్ల ప్రారంభం నేడు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీకి ప్రభుత్వ వైద్యాన్ని చేరువ చేస్తూ సర్కారు కొత్త యూపీహెచ్‌లను నిర్మించింది. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో రూ.80 లక్షలు, రూ.కోటి60 లక్షలతో పురుషోత్తపురం, బెల్లుపడ వద్ద రెండు అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌సెంటర్ల పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి చేసింది. ఈ యూపీహెచ్‌సీలను సోమవారం మంత్రి సీదిరి అప్పలరాజు ప్రారంభించనున్నారు.

సీఎం వైఎస్‌ జగన్‌ చలవే..



మున్సిపాలిటీలో ఉన్న 23 వార్డులకు సీహెచ్‌సీ మాత్రమే ఆధారంగా ఉండేది. ఇదే విషయాన్ని వైఎస్సార్‌సీపీ అధికారంలోని వచ్చిన వెంటనే మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌ సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో ఈ మున్సిపాలిటీలో రెండు అర్బన్‌ ప్రైమ రీ హెల్త్‌సెంటర్ల నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఇదంతా సీఎం చలవే.

– పిలక రాజలక్ష్మి, ఇచ్ఛాపురం మున్సిపల్‌ చైర్‌పర్సన్‌

ఇచ్ఛాపురమంటే ప్రత్యేక అభిమానం



సీఎం వైఎస్‌ జగన్‌కు ఇచ్ఛాపురమంటే ప్రత్యేక అభిమానం. అందుకే ఇక్కడి సమస్యలను ఎప్పుడు ప్రస్తావించినా వెంటనే పరిష్కరిస్తారు. అందులో భాగంగానే స్థానిక ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం నాణ్యమైన వైద్యసేవలు అందించాలని తలచారు. అందుకు తగ్గట్టుగానే పనులు కూడా చేయించారు.

– పిరియా సాయిరాజ్‌, మాజీ ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం

మహిళల రక్షణకు పటిష్ట చట్టాలు




మహిళా అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వక్తలు, మహిళా నాయకులు

కాశీబుగ్గ: మహిళలకు రక్షణ కల్పించి వారి హక్కులు కాపాడాలంటే పటిష్టమైన చట్టాలు అవసరమని ఐద్వా జిల్లా కార్యదర్శి అల్లాడ లక్ష్మి అన్నారు. ఆదివారం కాశీబుగ్గలో ఓ పాఠశాలలో ఐద్వా శ్రామిక మహిళ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను కట్టు బానిసలుగా ఉండాలని శాసించే ఈ సమాజ రుగ్మతలకు వ్యతిరేకంగా మహిళలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శ్రామిక మహిళలు వెట్టిచాకిరీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్‌.గణపతి మాట్లాడుతూ స్కీమ్‌ వర్కర్లకు కనీసం భరోసా కల్పించాలని డిమాండ్‌ చేశారు. ఐద్వా పలాస మండల కార్యదర్శి ఎస్‌.ఢిల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సదుస్సులో శ్రామిక మహిళలు ఆర్‌ అప్పలనరసమ్మ, కె.మహాలక్ష్మి, సుందరి, భూదేవి, శకుంతల, కాంచన, సుజాత, సరస్వతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

13న ప్రధాన మంత్రి సురాజ్‌

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: ప్రధాన మంత్రి సురాజ్‌ కార్యక్రమం ఈనెల 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు నగరంలోని బాపూజీ కళామందిరంలో నిర్వహిస్తున్నట్టు ఎస్సీ కార్పొరేషన్‌ ఈడీ ఆర్‌.గడ్డెమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి షెడ్యూలు కులాల, వెనుకబడిన తరగతులు, సఫాయి కార్మికులతో వర్చువల్‌ విధానంలో మాట్లాడుతారని ఆమె తెలిపారు. నమస్తే పథకంతో లబ్ధి పొందిన వారితో ప్రధాని సంభాషిస్తారని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ఎంపికైన సఫాయి, కర్మాచారీలకు వ్యక్తిగత భద్రతా కిట్లు, ఆయుష్మాన్‌ కార్డులు అందజేయనున్నట్టు తెలిపారు.

నేత్రపర్వం.. భస్మాభిషేకం



భస్మాభిషేకంలో రావివలస ఎండల మల్లికార్జునస్వామి

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జున స్వామికి ఆదివారం భస్మాభిషేకం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్‌ ఎస్‌.సుధాకర్‌, ఈఓ వి.రాధాకృష్ణ, సర్పంచ్‌ ఎస్‌.బాలకృష్ణ, ఎంపీటీసీ ఎం.కిశోర్‌తో పాటు అర్చకులు రామకృష్ణ, మోహన్‌, యుగంధర్‌ నేతృత్వంలో స్వామి వారికి భస్మాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

–టెక్కలి

ఘనంగా మహా పడియా



స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీముఖలింగం శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం స్వామికి పడియా కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి ఆలయ అధికారులు, అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

–జలుమూరు

రాజమ్మ సన్నిధిలో..

వత్సవలసలో కొలువున్న రాజమ్మ తల్లి (రాజరాజేశ్వరి) దర్శనానికి భక్తులు మూడో వారం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. శనివారం రాత్రికి వచ్చిన భక్తులు బసచేసి రాజరాజేశ్వరి (రాజమ్మతల్లి) పాటు భూలోకమ్మ తల్లికి ఆదివారం ఉదయం మొక్కులు తీర్చుకున్నారు. వేకువ జామున సమీపంలోని సముద్రంలో స్నానాలాచరించి, ఇక్కడే వంటలు చేసుకుని తల్లిని దర్శించుకున్నారు.

– గార



రాజమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

టెక్కలిలో పోలీసుల కవాతు



టెక్కలిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

టెక్కలి రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టెక్కలి పరిసర ప్రాంతాల్లో ఆదివారం పోలీసు కవాతు నిర్వహించారు. టెక్కలి ఎస్‌ఐ లక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఇందిరాగాంధీ జంక్షన్ మీదుగా అంబేడ్కర్ జంక్షన్ వరకు అక్కడి నుంచి నాలుగురోడ్ల జంక్షన్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భాగంగా సుమారు 70మంది సెంట్రల్ స్పెషల్ పోలీస్ ఫోర్సు సిబ్బంది పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ర్యాలీలో ఎస్‌ఐ-2 వెంకటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

'పొందూరు ఖాదీని వారసత్వ సంపదగా గుర్తించాలి'



ఖాదీ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న ఇంటాక్ సభ్యులు

పొందూరు: పొందూరు ఖాదీని ప్రత్యేక కళగానూ, వారసత్వ సంపదగానూ ప్రభుత్వాలు గుర్తించాలని ఇంటాక్ (భారతీయ జాతీయ కళలు సాంస్కృతిక వారసత్వ సంస్థ) కన్వీనర్ నూక సన్యాసిరావు అన్నారు. ఆదివారం పొందూరు ఏఎఫ్‌కేకే సంఘాన్ని సందర్శించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పొందూరు ఖాదీని చేనేతతో పోల్చడం సరికాదని అన్నారు. ఖాదీ సంస్థ అభివృద్ధికి కావాల్సిన రుణాలను నాబార్డు ద్వారా అందించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అనంతరం ఖాదీ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు దండా వెంకటరావు, కామేశ్వర ప్రసాద్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఇంటాక్ కో కన్వీనర్ వావిలపల్లి జగన్నాధరావు, మాజీ కన్వీనర్ రాధా ప్రసాద్, మాజీ కో-కన్వీనర్ సురంగి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

జీడి పరిశ్రమలో అగ్నిప్రమాదం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని అన్నపూర్ణ సినిమా థియేటర్ వద్ద ఉన్న జీడి పరిశ్రమలో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ షర్క్యూట్ కారణంతో వరుణ్ క్యాష్యూ జీడి పరిశ్రమలో మంటలు అంటుకున్నాయి. భోజన విరామం కావడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. గోదాంలో ఉన్న జీడిపప్పు నిల్వల వద్ద మంటలు చెలరేగగా కాశీబుగ్గ ఫైర్ అధికారులు మంటలను అదుపు చేశారు.

తృటిలో తప్పిన ప్రమాదం

టెక్కలి: టెక్కలి నవీన్‌నగర్‌లో ఆదివారం రాత్రి తృటిలో ఘోర ప్రమాదం తప్పింది. నిర్మాణంలో ఉన్న ఓ భవనానికి కట్టిన పరంజా కర్రలు ఒక్క సారిగా విద్యుత్ ఎల్‌టీ లైన్లపై పడ్డాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వైర్లపై పడిన కర్రలను వేరు చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వైర్లు తెగకపోవడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు.

పాతపట్నంలో రెండిళ్లలో చోరీ

పాతపట్నం: పాతపట్నంలోని విద్యానగర్‌లో శనివారం రాత్రి తాళం వేసిన రెండు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కింద ఇంటిలో యాజమాని మామిడి షణ్ముఖరావు శివరాత్రికు ఊరు వెళ్లడంతో ఇంటికి తాళం వేశారు. పై ఇంటిలో అద్దెకు ఉంటున్న ధర్మాన లోకనాథం శివరాత్రికి సొంత గ్రామం లాబరకు కుటుంబ సభ్యులతో వెళ్లారు. దీంతో దొంగలు శనివారం రాత్రి ఇళ్లలోకి జొరబడి షణ్ముఖరావు ఇంట్లో బెడ్ రూమ్‌లో ఉన్న బీరువాలో ఒక వెండి గ్లాస్, లోకనాథం ఇంట్లో బెడ్ రూమ్‌లో ఉన్న బీరువాలో తులంన్నర చైన్, ఒక ఉంగరం, చెవి దిద్దులు మొత్తం రెండున్నర తులాల బంగారం, రూ.5 వేల నగదు దొంగిలించారని బాధితులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఇంటి యాజమాని షణ్ముఖరావు వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందించారు. అదేవీధిలో మరో ఇంటిలో దొంగలు తాళం పగలుగొట్టడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. శ్రీకాకుళం నుంచి క్లూస్‌టీమ్ వచ్చి దర్యాప్తు చేశారు.

యువకుడి ఆత్మహత్య

సరుబుజ్జిలి: మండలంలోని వీరభద్రాపురం గ్రామానికి చెందిన సనపల వెంకటరమణ (23) అనే యువకుడు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సరుబుజ్జిలి గ్రామానికి సమీపంలో ఉన్న జీడితోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ బి.నిహార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. వెంకటరమణ దుబారా ఖర్చులకు అలవాటు పడి చాలా చోట్ల అప్పులు చేశాడు. అవి తీర్చలేక నిత్యం బాధ పడుతూ ఉండేవాడు. ఇతనికి వివాహం కూడా అయ్యింది. మూడు నెలల కుమార్తె ఉంది. అప్పుల బాధ తట్టుకోలేక ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుని తల్లి సనపల వజ్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

వంశధారకు నందీశ్వరుడు



సిద్ధం చేసిన నంది వాహనం

- శ్రీముఖలింగంలో నేడు త్రిశూల చక్రతీర్థ స్నానాలు
- నదిలో బారికేడ్ల ఏర్పాట్లు పూర్తి
- 300 మంది వరకూ పోలీసులతో బందోబస్తు



ఎల్.ఎన్.పేట: వంశధార నదిలో మిరియాపల్లి రేవు వద్ద బారికేడ్లు

జలుమూరు, ఎల్ఎన్ పేట: శ్రీముఖలింగం శివరాత్రి ఉత్సవాల్లో చివరి రోజు గురువారం వంశధార నదిలో స్వామి త్రిశూల చక్రతీర్థ స్నానాలు జరగనున్నాయి. ఈ పుణ్యక్రతువుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు బుధవారం తెలిపారు. ప్రధాన ఆలయం నుంచి మధ్యాహ్నం 12 గంటలకు స్వామి ఉత్సవమూర్తులతో తూర్పుదిశన బయలు దేరి ఉత్తర దిశగా వంశధార నదికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వంశధార నదిలో రెండు వైపులా బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు రోడ్లు, భవనాల శాఖ అధికారులు తెలిపారు. లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా ఆలయం నుంచి స్వామివారి ఉత్సవమూర్తులను నంది వాహనంపై తీసుకువెళ్లే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, తోపులాటలు జరగకుండా దారి పొడవునా 8 రోప్ పార్టీలు వినియోగిస్తున్నామని నరసన్నపేట సీఐ బూర ప్రసాదరావు తెలిపారు. అలాగే ఆలయం వద్ద స్వామి దర్శనాలు, నదిలో బందోబస్తు, మిరియాపల్లి రేవులో పుణ్యస్నానాలు జరిగే సమయంలో భక్తులు రద్దీ, అల్లరిమూకల నిలుపుదల, శ్రీముఖలింగం గ్రామానికి రెండువైపులా ట్రాఫిక్ నియంత్రణ, పుణ్యస్నానాలు అనంతరం భక్తులు తిరిగి వారి స్వగ్రామాలకు చేర్చడం ప్రధానమని సీఐ తెలిపారు. ఈ క్రతువుకు 300 మంది పోలీసు సిబ్బంది పనిచేస్తారని ఆయన తెలిపారు.

అర్హులందరికీ న్యాయం చేశాం: మంత్రి సీదిరి



కొత్తపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: ప్రజల మేలు కోసం కరోనా సమయంలో ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి సేవలు అందించామని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలంలోని కొత్తపల్లిలో సర్పంచ్ సేనాపతి దివ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక.. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించాక కరోనా తీవ్ర ప్రభావం చూపిందన్నారు. అలాంటి కష్ట సమయంలో రాష్ట్రంలో కనిపించని నాయకులు నేడు ఓట్లు అడగడానికి వస్తున్నారన్నారు. వలంటీర్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రభుత్వం, అంతా కలసి ప్రజలకు అప్పట్లో సేవలు అందించామని గుర్తు చేశారు. పక్క రాష్ట్రాల్లో చంద్రబాబు ఏసీ భవంతుల్లో దాక్కుని, ప్రజాద్రోహిగా మిగిలిపోయారన్నారు. పదేళ్లుగా ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. ప్రజలు నమ్మి పార్లమెంట్‌కు పంపితే కేవలం మాటలగారడీ చేస్తున్నారని విమర్శించారు. ఐదేళ్లలో కోవిడ్ సుమారు రెండేళ్ల పాటు రాష్ట్రాన్ని కష్టాల్లో అతలాకుతం చేసినప్పటికీ, మొక్కవోని దీక్షతో ప్రజలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆదుకుందన్నారు. మోసాలు, మోసపూరిత హామీలివ్వడం తెలుగు దేశం పార్టీకి వెన్నతో పెట్టిన విద్యని, మరో 33 రోజులు మాత్రమే ఎన్నికలకు మిగిలి ఉన్నాయన్నారు. కష్టాల కడలి నుంచి గట్టెక్కించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేస్తే ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. అర్హులైన వారందరికీ న్యాయం చేశామని, మళ్లీ ఆశీర్వదించి, అధికారం అందిస్తే పథకాలు కొనసాగిస్తామని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, జిల్లా కార్యదర్శి దల్లి జానకిరావురెడ్డి, మహిళా జిల్లా కార్యదర్శి బల్ల లీలాకుమారి, కోఆప్షన్ సభ్యుడు యవ్వారి నాగేశ్వరరావు, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సాత్ర ఢిల్లేశ్వరరావు, పలువురు సర్పంచ్, ఎంపీటీసీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● తల్లి సేవలో..



బెల్లుపడ గ్రామంలోని 12, 13 వార్డుల్లో ఆదివారం నిర్వహించిన గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాల్లో జిల్లాపరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ పాల్గొన్నారు. అమ్మవారి ప్రతిరూపమైన గజ ముద్దని తలపై పెట్టుకొని తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ నాయకులు, వార్డు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

– ఇచ్ఛాపురం

24న రాష్ట్ర స్థాయి విద్యాసదస్సు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, యూటీఎఫ్ స్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి స్మారక రాష్ట్ర స్థాయి విద్యాసదస్సు శ్రీకాకుళం వేదికగా ఈనెల 24వ తేదీన జరగనుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా యూటీఎఫ్ ఆఫీస్ బేరర్స్ సమావేశం స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎల్.బాబూరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వాల ఏకపక్ష నిర్ణయాలు, నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా తెలుగుజాతి ఐక్యతకు చిహ్నంగా యూటీఎఫ్ స్థాపనలో క్రియాశీలకంగా పనిచేసిన వెంకటస్వామి ఎంతోమందికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్ మాట్లాడుతూ విద్య ఉపాధ్యాయులకు ఈ రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. వాటిని ఇప్పటికీ చెల్లించకపోవడం బాధాకరమన్నారు. కమిటీ సిఫారసు చేసిన ఐఆర్ 30 శాతం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే ఐఆర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామమూర్తి మాట్లాడుతూ యూటీఎఫ్ చేస్తు న్న ఓట్ ఫర్ ఓపీస్‌ని విస్తృతంగా ప్రచారం చేయా లని కోరారు. అలాగే 24వ తేదీన నిర్వహించతలపెట్టిన రాష్ట్రస్థాయి విద్యా సదస్సు విజయవంతం చే యాలని వారు కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, కె.దాలయ్య, కోశాధికారి బి.రవికుమార్, కార్యదర్శులు హెచ్.అన్నాజీరావు, పి.సూర్యప్రకాష్, జి.శారద, ఎస్.స్వర్ణకుమారి, ఎంపీ రమణ, పి.మురళీధర్, బి.గౌరీశ్వరావు, బి.శంకరరావు, జి.శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● నాలుగు దశాబ్దాల తర్వాత..



శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో 1980-81లో టెన్త్ చదువుకున్న వారు ఆదివారం ఆత్మీయంగా మళ్లీ కలుసుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా మళ్లీ కలిసి నాటి ముచ్చట్లు జ్ఞాపకం చేసుకున్నారు. సంబరాలు, సత్కారాలతో రోజంతా ఆహ్లాదంగా గడిపారు.

– శ్రీకాకుళం కల్చరల్

క్రీడలపై ఆసక్తి పెరగాలి: ఎస్పీ



వాలీబాల్‌లో మొదటి బహుమతి సాధించిన యువకులకు ట్రోఫీని అందజేస్తున్న ఎస్పీ రాధిక

మెళియాపుట్టి: చదువుతో పాటుగా క్రీడలపై కూడా విద్యార్థులు ఆసక్తి కనబరచాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ఇటీవల పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు మండలాల క్రీడాకారులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలిచిన వారికి మెళియాపుట్టి మండలం చాపర జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. పోలీసులు సమాజ సేవకులని, తప్పు చేసిన వాళ్లే పోలీసులకు భయపడాలి గానీ మిగతా వారంతా స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. మత్తు పదార్థాల వైపు వెళ్ల వద్దని, ప్రేమ పేరుతో మోసపోవద్దని విద్యార్థులకు సూచించారు. ఎవరైనా వెంట పడి వేధిస్తే 112 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని చెప్పారు. వాలీబాల్, క్రికెట్, కబడ్డీ తదితర పోటీల్లో కొత్తూరు మండలం మహర్తాపురం టీమ్, నివగాం టీమ్, పెద్దమడి పాఠశాల, చాపర యువకులు, పాతపట్నం లేజీ హార్స్ క్రికెట్ టీమ్‌ల యువకులు బహుమతులు అందుకున్నారు. పోలీసుల తరఫున పలు గ్రంథాలయాలకు స్టడీ మెటీరియల్స్, కమ్యూనిటీ హాళ్లకు వాటర్ ప్యూరిఫైయర్లు అందించారు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, పాతపట్నం సీఐ నల్లి సాయి, కొత్తూరు సీఐ వేణుగోపాలరావు, ఎస్‌ఐలు మెళియాపుట్టి రాజేష్, హిరమండలం నారాయణస్వామి, పాతపట్నం మహమ్మద్ యాసిన్, కొత్తూరు మహమ్మద్ అజాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన నీలకంఠం, నందిని

మందస: మండలంలోని జాతీయ రహదారిపై కొర్రాయిగేటు సమీపంలో కొత్తకమలాపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీకాకుళం చెందిన నందిని, నీలకంఠం ఈవెంట్ చేయడానికి ఇచ్ఛాపురం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా.. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. 108 వాహనం సిబ్బంది శంకర్, మురళీమోహన్ టెక్కలి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రత్యేక పూజలు



క్యూలో కిక్కిరిసిన భక్తులు

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మాఘమాస ఆదివారం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేకంగా మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించారు. మరోవైపు వత్సవలస రాజులమ్మ జాతర సందర్భంగా వేకువజాము నుంచే భక్తులు కుటుంబాలతో కలిసి విచ్చేయడంతో ముందుగా అరసవల్లి ఆదిత్యుడిని వారంతా దర్శించుకునేందుకు బారులు తీరారు. మహిళలు ఇంద్రపుష్కరిణి ఆవరణలో పిడకల పొయ్యిపై పాలను పొంగించి క్షీరాన్నాన్ని ప్రసాదంగా స్వామికి నివేదించారు. అలాగే పలువురు భక్తులు తలనీలాలను మొక్కుగా సమర్పించారు. ఇక ఆరోగ్యం కోసం భక్తులు సూర్యనమస్కార పూజలను చేయించుకున్నారు. భక్తులకు ఉచిత మంచినీరు, ప్రసాదాలను పంపిణీ చేయడంతో పాటు అన్న ప్రసాద భోజనాన్ని కల్పించేలా ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు చర్యలు చేపట్టారు. అలాగే అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్వామి మూలవిరాట్టుకు అలంకరించి పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 6.30 గంటల నుంచే సర్వదర్శనాలకు అనుమతించారు. ఒక్క ఆదివారంలో మొత్తంగా రూ.4,53,272 ఆదాయం లభించింది. ఇందులో వివిధ దర్శనాల మార్గాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1,67,500, విరాళాలు, ఆర్జిత సేవల ద్వారా రూ.1,05,772, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.80 లక్షల ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు తెలియజేశారు.

ఆదిత్యుని సన్నిధిలో ఎస్పీ రాధిక

అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జీఆర్ రాధిక కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు వారికి ప్రసాదాలను అందజేశారు.

విశాఖ రాజధానికి చంద్రబాబే అడ్డు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి ధర్మాన ప్రసాదరావు

- కళింగవైశ్యుల ఆత్మీయ సమావేశంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విశాఖలో రాజధాని ఏర్పాటుకు అడుగడుగునా చంద్రబాబు అడ్డుతగలడం సరికాదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. కేవలం అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పోతోందనే బాధ తప్ప రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు ఆయనకు అవసరం లేదని మండిపడ్డారు. శ్రీకాకుళం నగరంలో కళింగ వైశ్యుల ఆత్మీయ సమావేశం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోణార్క్ శ్రీను ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కళింగవైశ్యులు సుమారు వంద మందికి పైగా వైఎస్సార్‌సీపీలోకి చేరారు. మంత్రి ధర్మాన మాట్లాడుతూ కళింగవైశ్యులను బీసీల్లో చేర్పించేందుకు తాను చేసిన కృషిని గుర్తు చేశారు. చంద్రబాబుకు బీసీ వర్గాలంటే ఎప్పుడూ చిన్నచూపేనని అన్నారు. తన రాజకీయ జీవితం ప్రారంభం నుంచి కళింగవైశ్యులు తన వెంటే ఉన్నారని, ఎప్పుడూ ఉంటారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నానన్నారు. నగరంలో రిమ్స్, గార్బేజీయార్డు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్, రోడ్లు, వంతెనలు, గ్యాస్ క్రిమిటోరియం వంటివి ఏర్పాటు చేశామని, త్వరలో వేసవిలో కూడా సాగునీరు తీసుకువస్తామన్నారు. ఈ సందర్భంగా కళింగవైశ్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోణార్క్ శ్రీను మాట్లాడుతూ మంత్రి ధర్మాన చొరవతోనే బీసీలో చేరామన్నారు. కళింగవైశ్యుల పక్షాన ఎప్పుడూ ధర్మాన ఉంటారని అన్నారు. కార్యక్రమంలో కళింగ వైశ్యకార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, తంగుడు జోగారావు, ఊన్న నాగరాజు, బరాటం సంతోష్, వైశ్యరాజు మోహన్‌రావు, తంగుడు నాగేశ్వరరావు, గుడ్ల మల్లేశ్వరరావు, గుడ్ల దామోదరరావు, డాక్టర్ సోమేశ్వరరావు, క్రెడాయ్ రమేష్ చక్రవర్తి, అంధవరపు ప్రసాద్, సంతోష్, అంధవరపు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో ప్రాతినిధ్యం ఉండాలి

- మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: ప్రజాస్వామ్యంలో ప్రతి సామాజిక వర్గానికి చట్టసభలో ప్రాతినిధ్యం ఉండాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆదివారం అంపోలు వద్ద జిల్లా జైలు సమీపంలో జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రెడ్డి సామాజిక వర్గానికి అనేక అవకాశాలు వచ్చాయని, ముగ్గురు కార్పొరేషన్ చైర్మన్లుగా జిల్లా నుంచి ఉన్నారన్నారు. త్వరలో చట్ట సభల్లో కూడా అవకాశం వస్తుందన్నారు. అణగారిన వర్గాలకు మంచి భవిష్యత్ చూపేలా వైఎస్ జగన్ పాలన సాగిందన్నారు. చంద్రబాబు ప్రజలకు ఏదైనా మంచి కార్యక్రమం చేపట్టారా అని ప్రశ్నించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు జిల్లాకు చేసిన మేలేదైనా ఉందా అని అన్నారు. రాజశేఖర రెడ్డి పాలనలో ఎన్నో ప్రాజెక్టులు వచ్చాయని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ వైఎస్ జగన్ దయ వల్ల ఫిషింగ్ హార్బర్, మూలపేట పోర్టు, వంశధార ఎత్తిపోతల పథకం వంటివి కనిపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కాయల వెంకటరెడ్డి, పలు కార్పొరేషన్ల చైర్మన్లు శ్యాంప్రసాద్‌రెడ్డి, దుక్కల లోకేశ్వరరెడ్డి, బల్లాడ జనార్ధనరెడ్డి, ఎస్ఆర్ షాపింగ్ మాల్ గోపీనాథ్‌రెడ్డి, రెడ్డి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

జపనీస్ భాషపై శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: జపనీస్ భాషపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి పీటీ సామిశ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ ఉన్న వారికి ఉపయోగపడుతుందని అన్నారు. శిక్షణ అనంతరం జపాన్‌లో పనిచేసేందుకు సిద్ధం కావాల్సి ఉంటుందని తెలిపారు. అక్కడ నర్స్ ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. 20 నుంచి 32 ఏళ్ల మధ్య మహిళలు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడ బ్ల్యూ. స్కిల్ యూనివర్స్. ఏపీఎస్ఎస్‌డీసీ.ఐఎన్ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. రూ. 1.1 లక్షలు దాటి ప్యాకేజీ వేతనం లభిస్తుందని అన్నారు. పూర్తి వివరాలకు 7780167645ను సంప్రదించాలని సూచించారు.

డోలోత్సవానికి వేళాయె

- 12 నుంచి 25 వరకు చక్రధరుని డోలోత్సవాలు



బెజ్జిపుట్టుగలో వెలసిన చక్రపెరుమాళ్లు ఆలయం



బెజ్జిపెట్టుగలో వెలసిన శ్రీదేవీభూదేవీసమేత చక్ర పెరమాళ్లు

కవిటి: బెజ్జిపుట్టుగలో వెలసిన శ్రీచక్రధర పెరుమాళ్ల డోలోత్సవానికి సమయం ఆసన్నమైంది. రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా 14 రోజుల పాటు ఉత్సవాలు ఈ ఆలయంలో అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశాకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొంటారు. చక్రధరుని డోలోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఉదయం సుప్రభాత సేవతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మార్చి 25వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. ఉత్సవాలు జరిగే అన్ని రోజులు పల్లకీ సేవ, గరుడ వాహన సేవలు నిర్వహిస్తారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు పొందల రామస్వామి, అప్పారావునాయుడుల కుటుంబాల వారు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. కవిటి, ప్రగడపుట్టుగ, పిరియా వీధి, బార్లవీధులకు చెందిన వారు ఒక్కొక్క గ్రామం ఒక రోజు ఈ ఉత్సవాల్లో తమవంతు ప్రత్యేక పూజలు చేపడతారు.

ఈ నెల 26వ తేదీన వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు పొందల శ్రీరాంబాబు నాయుడు కుటుంబం ఆర్థిక సాయంతో తొలిరోజు విశాఖపట్నంకు చెందిన శ్రీ కళాభినయ ఆర్ట్స్ బేనర్‌పై 'ఓ కాశీ వాశీ రావయ్యా'అను సాంఘిక నాటికను ప్రదర్శించనున్నారు. ప్రతి రోజూ రాత్రి 8 గంటలకు బందరుకు చెందిన మడమల రాంబాబు భాగవతార్ హరికథాగానం ఉంటుంది.